క్లుప్తంగా

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను గురువారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు కేంద్రబృందం పర్యటన

తిరువూరు: వర్షాభావం కారణంగా తిరువూరు నియోజకవర్గంలో ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు గురువారం కేంద్రబృందం రానున్నట్లు తిరువూరు వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కరువుమండలాలుగా గుర్తించిన తిరువూరు మండలంలోని లక్ష్మీపురం, ఎర్రమాడు గ్రామాల్లో, గంపలగూడెం మండలంలోని గుళ్లపూడిలో కేంద్రబృందం పర్యటిస్తుందని పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: వర్షాభావ పరిస్థితుల్లో ఎండిన వరిపొలాలను పరిశీలించేందుకు సెంట్రల్ టీమ్ బృందం గురువారం తిరువూరు, నియోజకవర్గంలో పర్యటించనుందని గంపలగూడెం వ్యవసాయాధికారి సాయిశ్రీ పేర్కొన్నారు. గంపలగూడెం మండలంలో 380 హెక్టార్లలో పంట ఎండిపోయినట్లు సిబ్బంది నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, గ్రామ సర్పంచ్ కాకి దేవమాత అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జూపూడిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించారు. సంస్థ బూడిద చెరువు మా గ్రామంలో ఉన్నందున కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఏడాదికి రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. శిబిరంలో మధుమేహం, బీపీ పరీక్షలతో పాటు నేత్ర, ఇఎన్‌టీ, అల్ట్రా స్కానింగ్, కాళ్ల నరాల పటుత్వ తదితర పరీక్షలు 300 మందికి నిర్వహించారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు.

కొత్త బస్సు సర్వీసులు నడపాలి

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి పలు ప్రాంతాలకు కొత్త బస్సు సర్వీసులు ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరారు. బుధవారం జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తిరువూరు నుంచి పామూరు, బీహెచ్ఈఎల్ సర్వీసులు నడపాలని, గంపలగూడెం నుంచి భద్రాచలం, హైదరాబాద్ నగరాలకు బస్సుసదుపాయం కల్పించాలని, తిరువూరు నుంచి సాయంత్రం నాలుగు గంటలకు మచిలీపట్నం బస్సుసర్వీసు పునరుద్ధరించాలని కోరినట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. తిరువూరు నుంచి హైదరాబాద్‌కు గతంలో ఉదయం నడిపిన బస్సుసర్వీసు పునరుద్ధరించాలని కూడా కోరారని పేర్కొన్నారు. తిరువూరు నుంచి మధిర, కొత్తపల్లి గ్రామాలకు కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారని తెలిపారు. ప్రయాణికుల వినతులను ఉన్నతాధికారులకు తెలియజేసి, తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



ముసునూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వర రావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు యోహాన్, ఆరేపల్లి, ప్రవంతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ జాతీయ పోటీలకు నూజివీడు క్రీడాకారులు



హన్సన్‌సువర్ణరాజు



శ్రీరమ్య

విజయవాడ స్పోర్ట్స్: చత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో జరిగే అండర్-20 జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో నూజివీడుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఇటీవల భీమవరంలో జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో నూజివీడు ఐఐఐటీలో బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.హన్సన్‌సువర్ణరాజు, నూజివీడు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.శ్రీరమ్య అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్ దనియాల నాగరాజును ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సతీష్ అభినందించారు.

పవిత్రసంగమానికి పోటెత్తిన భక్తులు



ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద పోలిస్వర్గం దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: కార్తికమాసం ముగింపు సందర్భంగా పోలిస్వర్గం పాడ్యమి పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్దకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి సంగమం వద్దకు చేరుకుని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. లోకమంతా చల్లగా ఉండాలని ఆకాంక్షించి బ్రాహ్మణులకు దానం చేసి నమస్కరించారు. ఒత్తులతో దీపాలు వెలిగించి కృష్ణమ్మకు ఒడిలో విడిచి పెట్టారు. సమీపంలోని శివాలయాల్లో పూజలుచేసి మొక్కలు తీర్చుకున్నారు. మున్సిపాల్టీ అధికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలోని శివాజీ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం పోలి పాడ్యమి పురస్కరించనుకుని రజకుల ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేసి, కుంకుమార్చన నిర్వహించారు.



పవిత్రసంగమం వద్ద పోలిస్వర్గం దీపారాధన చేస్తున్న భక్తులు



మైలవరం శివాజీ వీధిలో ఆంజనేయస్వామి విగ్రహంతో గ్రామోత్సవం

అనంతరం స్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ విగ్రహ దాత మల్లెల వెంకటేశ్వరరావు, సిద్ధాంతి పత్తి సాయి దశరథ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తుపాను కారణంగా పంటలను కోల్పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం వ్యవసాయాధికారులతో పంట నష్టం అంచనాలపై సమీక్ష నిర్వహించారు. కేంద్రబృందం పంట నష్ట పరిశీలనకు రానున్నందున నిష్పాక్షికంగా వివరాలు నమోదు చేయాలని, రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వర్షాలకు తడిసి రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంటనష్టం నమోదులో అవకతవకలు జరిగితే అధికారులపై చర్యలు తప్పవన్నారు. తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఏడీఏ కెనడీ, వ్యవసాయాధికారులు పద్మ, రాజ్యలక్ష్మి, టిప్పుసుల్తాన్, సాయిశ్రీ, ఉద్యానవన అధికారి సోహెల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

డెప్యూటీ డివిజన్ కార్యదర్శిగా సురేష్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్స్ డివిజనల్ డెప్యూటీ కార్యదర్శిగా గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ నియమితులయ్యారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఎస్‌సీఆర్ఈ సంఘ్ 224వ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటుపల్లి బ్రాంచిలో బుధవారం జరిగిన బ్రాంచి ఎగ్జిక్యూటీవ్ సభ్యుల సమావేశంలో గద్దా సురేష్‌ను సత్కరించారు. తనపై నమ్మకంతో డెప్యూటీ డివిజన్ కార్యదర్శిగా ఎంపిక చేసిన కేంద్ర యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాంచ్ అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ డేవిడ్‌రాజు, కోశాధికారి విమల్‌సాయి, లాలియానాయక్, శంకర్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.



డివిజనల్ డిప్యూటీ కార్యదర్శిగా ఎన్నికైన సురేష్‌ను సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

రూ.1.65 కోట్ల బోనస్ పంపిణీ

లక్ష్మీపురం(తిరువూరురూరల్): కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు రెండో విడత ధర వ్యత్యాసాన్ని బోనస్ కింద లక్ష్మీపురం పాలశీతల కేంద్రం ఆవరణలో బుధవారం పంపిణీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రెండు విడతలుగా బోనస్ చెల్లించినట్లు యూనియన్ జిల్లా డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తెలిపారు. రైతులు పాల ఉత్పత్తి పెంపుదలకు, నాణ్యత కలిగిన పాల సరఫరాకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి, ట్రస్టు బోర్డు సభ్యులు విజయలక్ష్మి, సత్యనారాయణ, రంగారావు, సుశీల, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం

ముసునూరు: పాడి రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. చెక్కపల్లి దివానం సెంటర్లోని, ఏ, బీ పాల సొసైటీల కమిటీ సభ్యులు, పాడి రైతులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ-సొసైటీలో 46 మంది పాడి రైతులకు రూ.1,66,540, బి-సొసైటీలో 23 మంది పాడి రైతులకు రూ.76,110 బోనస్‌ను పంపిణీ చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన పాడి రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ కిరణ్ కుమార్, సంఘాల అధ్యక్షులు దుర్గాలక్ష్మి, రాంబాబు, సూపర్‌వైజర్లు సుబ్బారావు, అనుదీప్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలి

విస్సన్నపేట: తుపాను కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటల రైతుల వివరాలను రెవెన్యూ ,వ్యవసాయశాఖ సంయుక్తంగా ఈ నెల 18వ తేదీలోగా నివేదికను సమర్పించాలని తహసీల్దార్ డి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలకు ఇన్యుమరేషన్‌పై గ్రామ రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. రీజనల్ కార్యదర్శి రామకృష్ణ, డిపో కార్యదర్శి పీఎస్ రావు, అధ్యక్షుడు ఆంజనేయులు, గ్యారేజీ కార్యదర్శి కోటేశ్వరరావు, డ్రైవర్ అసోసియేషన్ కార్యదర్శి జేఎస్ రావు పాల్గొన్నారు.

సైన్స్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సైన్స్‌తో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని, దేశం మానవ పురోగతి సైన్స్‌తోనే సాధ్యమవుతుందని ఇండియన్ స్ప్రింగ్స్ ఎన్నారై విద్యా సంస్థల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య అన్నారు. కొండపల్లి ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్ పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం బుధవారం జరిగింది. సైన్స్ అందరికీ అర్థమయ్యేలా బోధించడమే పాఠశాల లక్ష్యమన్నారు. విద్యార్థులు సైన్స్ సబ్జెక్ట్‌పై మక్కువ పెంచుకుని రేపటి తరం సైంటిస్టులు కావాలని కోరారు. ప్రిన్సిపాల్ నాగరత్నం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రెండోరోజుకు చేరిన తపాలా ఉద్యోగుల సమ్మె



తిరువూరు: తమ కోర్కెల సాధనకు గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. తిరువూరు డివిజన్లోని తపాలా సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో ఉత్తరాల బట్వాడాకు బుధవారం అంతరాయం కలిగింది. కేంద్రప్రభుత్వం తమ డిమాండ్లు ఆమోదించేవరకు సమ్మె కొనసాగిస్తామని ఉద్యోగుల సంఘ నాయకుడు లక్ష్మణరావు తెలిపారు. తిరువూరు పోస్టాఫీసు ఎదుట జీడీఎస్ సిబ్బంది ధర్నా చేశారు.

నూజివీడులో..

నూజివీడు: గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నూజివీడు డివిజన్ సెక్రెటరీ పి.నాగేశ్వరరావు కోరారు. నిరవధిక సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వీవీఎస్ అజరయ్య, కోశాధికారి జీపీ సారథి ఉపాధ్యక్షులు డి.మంగయ్య రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం వాకిలయ్య, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: వివిధ సచివాలయాల సిబ్బంది సహకారంతో విద్యార్థులకు ఇస్తున్న క్షేత్ర స్థాయి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ కోర్సును అభ్యసిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో బుధవారం సిబ్బంది తాము చేస్తున్న వృత్తిపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ లక్ష్మీకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు తమ గమ్యం నిర్ణయించుకుని ఆ దిశలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సరళకుమారి అభ్యర్థన మేరకు ఎంపీడీఓ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు లక్ష్మీరాజ్యం, రాధాకృష్ణ పర్యవేక్షించారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తుపాను ప్రభావంతో గొల్లపూడి పరిధిలో దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. గొల్లపూడి గ్రామ శివారులోని పొలాలకు చేరుకున్న మండల వ్యవసాయ శాఖ అధికారి బి.రంగనాథ్‌బాబు దెబ్బతిన్న పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు నష్టపరిహారం కోసం నమోదు చేస్తున్నామన్నారు. వీఏఏ శాంభవి పాల్గొన్నారు.

కల్యాణమండపానికి రూ.50 వేల విరాళం

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఒక భక్తుడు బుధవారం రూ.50,511 విరాళంగా ఇచ్చారు. తెలంగాణా రాష్ట్రం మధిర పట్టణానికి చెందిన ఊటుకూరు వేణుగోపాలరావు, స్వరాజ్యలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు.

మేడూరు దేవస్థానం ఆదాయం రూ.3.09 లక్షలు

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీలలో వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. గడచిన ఐదు నెలలుగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు రూ.3,09,602 లెక్కింపులో వచ్చినట్లు ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బంది హుండీలలోని కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

ముసునూరు: ముసునూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కంబాల రాంబాబు తెలిపారు. ముసునూరులో బుధవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గ నియామకం జరిగిందని, ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడుగా బి.పురుషోత్తం, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.ఏసుదాసు, డి.ప్రభుకిషోర్, సంయుక్త కార్యదర్శిగా ఈ.బాలస్వామి, కోశాధికారిగా ఎం.రాజు, కార్యవర్గ సభ్యులుగా డి.జోజి, బి.అబ్రహం, సలహాదారుడుగా బి.సంసోనులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రేపటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో ఈనెల 15 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తారనిపేర్కొన్నారు.

సుజికి షోరూం ప్రారంభం

నూజివీడు: నూజివీడులో సుజికి కస్టమర్ల కోసం అత్యాధునిక షోరూంను బుధవారం ప్రారంభించామని వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ అన్నారు. బుధవారం నూజివీడులో పద్మజ సుజుకి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ కస్టమర్లు వంద శాతం సంతృప్తి పొందుతారని, రికార్డ్ సేల్స్‌ని సాధించడమే కాకుండా, కస్టమర్స్ సంతృప్తి పరచడంలో కూడా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పద్మజ సుజుకి సీఈఓ అనురాధ, షోరూం సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.దుర్గా ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలి

ఎమ్మెల్యే రక్షణనిధి

నెమలి(గంపలగూడెం): 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు మరోసారి జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. గంపలగూడెం మండలం నెమలిలో బుధవారం రాత్రి 'పల్లెకు పోదాం', 'ఆంధ్రాకు మళ్లీ జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలో 56 నెలలుగా రాష్ట్రప్రభుత్వం ద్వారా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రామంలోని కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా లాంటి కష్టకాలంలో కూడా పేదలు ఇబ్బందిపడకూడదని సంక్షేమ పథకాలను ఆపకుండా పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమల్లో లంచగొండితనం , దళారులు ప్రమేయం లేకుండా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కావూరి వినయ్‌కుమార్, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వెంకటకృష్ణ, మల్లికార్జునరావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరరావు, నాయకులు నర్సారెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం నెమలిలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

జి.కొండూరు: తుపాను ప్రభావానికి నష్టపోయిన రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని కేడీసీసీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్రరాణా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెల్లటూరులో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులు తుపాను అంశాన్ని కూడా రాజకీయంగా వాడుకోవాలని చూడడం దుర్మార్గమన్నారు. తుపాను బాధిత రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు వీలైతే సలహాలు, సూచనలు చేయాలి తప్ప అనవసర రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రరాణా, లీలాశ్రీనివాసరావు

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న రక్షణనిధి

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామిని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి గురువారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ సహాయ కమిషనర్ డీ శ్రీరామవరప్రసాదరావు సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించగా స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని సహాయ కమిషనర్ అందజేశారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు కావూరి వినయ్‌కుమార్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరరావు, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వెంకటకృష్ణ పాల్గొన్నారు.



స్వామి చిత్రపటాన్ని ఎమ్మెల్యే రక్షణనిధికి అందజేస్తున్న సహాయ కమిషనర్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాతకుంట్ల(విస్సన్నపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ అన్నారు. మండలంలోని తాతకుంట్ల గ్రామ సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మేడా తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కాలీషా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

ఉద్యోగం కోసం లక్ష్యంతో చదవాలి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లను జారీచేసినందున నిరుద్యోగ అభ్యర్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదివితే ఉద్యోగం సాధించవచ్చని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ముందుగా సిలబస్, పరీక్ష విధానం అవగాహన చేసుకుని ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మెయిన్స్ లక్ష్యంగా చదివితే స్క్రీనింగ్ టెస్ట్ అవలీలగా విజయం సాధించవచ్చన్నారు. పోటీ ఎంతమంది ఉన్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఎవరికి వారే తాము ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివితే విజయం తథ్యమన్నారు. మార్కెట్లో లభించే పుస్తకాలన్నీ చదవడం కాక ప్రామాణిక పుస్తకాలను మాత్రమే చదవాలని సూచించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.



తిరువూరు శాఖా గ్రంథాలయంలో అవగాహన సదస్సు

సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రామకృష్ణానగర్ వర్డ్ ఆఫ్ చర్చిలో మంగళవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ పాలడుగు జోత్స్న దుర్గాప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయాలి

మైలవరం: శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయులకు డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పోస్టులు భర్తీ చేయాలని పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవాబ్ జానీ, రాఘవరాజు కోరారు. మైలవరంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బుధవారం పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే ఇచ్చిన పీజీటీ అధ్యాపక పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఏ పు ల్లారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు సూరిబాబు, నందిగామ మండల అధ్యక్షుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

కల్యాణమస్తు పథకం పంపిణీ

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన లింగారెడ్డి వెంకటేశ్వరరావు కుమారుడు నాగమల్లేశ్వరావు వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కల్యాణమస్తు పథకంలోరూ.20 వేలు విలువ చేసే బంగారు నాణాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.